

# ఆపద్ధర్మం

ఎమ్.డి.సౌజన్య

"ప్రపంచంలో అన్నింటికంటే తేలికైంది 'అది చెయ్... ఇది చెయ్' మనటం! అన్నింటికంటే కష్టమైంది - అలా చేస్తున్నప్పుడు వచ్చే అపాయాన్ని ఉపాయంగా తప్పించటం!" అంటారు-ఆర్యులు

అయితే!!...

భోజరాజుకు — కాళిదాసులా; అక్బర్‌కు — బీర్‌బల్‌లా; రాయలవారికి — రామలింగడులా; తైమూర్‌కి - నాసిరుద్దీన్ లాంటి వాళ్ళు దొరకటం — తిమ్మిని బొమ్మిని చేయటం, సమయానుకూలంగా ప్లేట్లు ఫిరాయించగలగటం— అప్పటి కట్టుకథల్లో మాటేగాని, ఇప్పటిరోజుల్లో అసంభవమంటారు!

కాని...!!

'భగత్‌సింగ్ హైస్కూల్' హెడ్మాస్టరు నూకరాజుగారికి మాత్రం — భజగోవిందం మేష్టరు — చేతిలో బెత్తంలా, పొడుంకాయలో చూర్ణంలా, పెన్నులో యింకులా, బుగ్గలో ఖారాఖిళ్ళీలా, భుజంమీది పైపంచెలా, తలలో నాలికలా, కాలికింది చెప్పులా, అయిపోయాడు!

భజగోవిందం మేష్టారు - స్కూలు ప్రెసిడెంట్ దశావతారంగారికి, మందుసీసాలు అందించటం దెగ్గరనుంచి మొదలుపెట్టి ప్యూను పానకాలు రాకపోతే బెల్లు కొట్టేవరకు గల అమాంబాపతు పనులన్నీ జమిలిగా చేయటంతో, చెప్పే పనికి, చెప్పబోయే పనికి "యస్సార్! యస్సార్!" అంటూ అరిగిన రికార్డులా అరుస్తుండటంతో 'భజగోవిందం' కాస్తా 'భజన గోవిందం'గా సార్థకనామధేయుడయ్యాడు.

ఇలా వుండగా ఒక శుభదినాన, స్కూలు ప్రెసిడెంట్ అవతారంగారు, ఎమర్జెన్సీ మీటింగు ఒకటేసి — ప్యూను పానకాలుని, హెడ్‌మాస్టరు నూకరాజుని, భజ(న) గోవిందాన్ని పిలిచి "ఇద్గో ఎడ్డుమేట్రూ! రేపొచ్చే రెపబ్లిక్కుదినానికి మన బళ్ళో గ్యాందీ యిగ్రం, మొండెం సైజుది, యిన్‌కంటాక్సు ఆపీసరుసేత ఆయిష్కరిద్దాం! వూరిమీద పడి సందా లొసూలుసేసి పని కానివ్వండి! గ్యాందుగుండాలి! నా పేరు సందాల పనిలో పైకి పొక్కకూడదు!" అన్నాడు హెడ్‌మాస్టరు భుజాలమీద భారం మోపుతూ.

అవతారంగారి ఆజ్ఞ, సుగ్రీవాజ్ఞ — అని అందరికీ తెలుసు! అందుకే త్రిమూర్తుల్లా ముగ్గురూ "ఎస్సార్! ఎస్సార్" అన్నారు, చేతులు నలుపుకుంటూ, వినయంగా.

అవతారంగారటు పోగానే హెడ్మాస్టరు తన హెడ్‌మాస్టరునని గుర్తు రాగానే — "మిస్టర్ భజగోవిందం — పిల్లల యడ్మిషన్సులో నేనేదొ నంజాతున్నానని, గుంజాతున్నానని, లోపాయకారీ చందాలు వసూలుచేశాననీ, నామీద యిప్పటికే కలెక్టరు దెగ్గరనుంచి పార్లమెంటుదాకా పిటీషన్లు ఏడిచాయి! కాబట్టి యీ చందాలపని — నువ్వూ-పానకాలూ జమిలిగా వసూలుచేసుకోండి!" అన్నాడు.

పానకాలు కళ్ళు ఆనందంతో మెరిశాయి. మళ్ళీ ఎప్పుడో 'జన్మకో శివరాత్రి' అన్నట్లు వచ్చే అవకాశం, సద్వినియోగం చేసుకోవాలని "చిత్తం! చిత్తం! మీ మాట నేనెలా కాదంటాను... అలాగే వసూళ్ళు సేత్తాను! అయితే డూటీమీద పోయినట్టు మమ్మల్నిద్దరినీ వదలాండి, రేపే మొదలెడతాను!" అన్నాడు తెచ్చికోలు వినయం నటిస్తూ.

రెండవరోజు ఉదయమే ప్యూను పానకాలు, భజగోవిందంను, 'భారతమాత హెయిర్ కటింగ్ సెలూన్'కి తీసికెళ్ళి సింగిల్ టీ యిప్పించి, "పంతులూ! మన ప్రెసిడెంటు దశావతారంగాడు గ్యాందీ యిగ్రం మన బళ్ళో ఏయించటంలో బలే ఇటిగేసనుంది! గ్యాందీగారూ, మన అవతారంగాడూ, ఇన్‌కమ్‌ట్యాక్సు ఆఫీసరూ — ఒకటే క్యాస్టు! పదిలక్షల సినిమాహాలొకటి కడుతుండాడుగా అవతారం! ఆడి జోలికి యిన్‌కంటాక్సోళ్ళు రాకుండా, కుక్క నోటికి బెల్లంముక్క అందిచ్చినట్టు, యీ గ్యాందీ యిగ్రం అడ్డం పెడుతుండాడు. ఎంతసెడ్డా ఆల్లూ ఆల్లూ వొకటేగదా!" అన్నాడు గీతోపదేశం చేసినట్టు.

భజగోవిందానికి, పానకాలు పచ్చి రౌడీ అనీ, ప్రెసిడెంట్ అవతారం నుంచి — ప్రతి పంతులు దెగ్గరా ప్రతిరోజూ దసరా మామూళ్ళు వసూలు చేస్తాడని, ఇందులో స్వపరభేదం లేదని,

గడియారపు ముళ్ళని ఖాతరుచేయకుండా కష్టంవచ్చినప్పుడు వచ్చిపోయే స్వేచ్ఛాప్రియుడని, అంతస్తు, హోదాలు పట్టించుకోని పచ్చి త్రాగుబోతని తెలుసు!

కాని, ఇంత లోతైన మనిషిని, ఆ బుర్రమీసాల వెనక, గుబురులాంటి కనుబొమల వెనక యింత గొప్ప అవగాహన, వూహాశక్తి వుందని కలలో కూడా ఊహించలేకపోయాడు.

''బజగోవిందంగారూ! ఈమధ్య జనంలో క్యాస్టు ఫీలింగు మరీ పెరిగిపోతోంది కాబట్టి నాలుగు కేస్టులోళ్ళు నాలుగు సందాలెయ్యాలంటే మనం నాలుగు కేస్టులకు సెందిన గ్యాంధీ, నెహ్రూ, అంబేద్కర్, మౌలానా అజాద్‌ల పేర్లు సెప్పాల'' అన్నాడు

భజగోవిందానికి మతిపోయి ''మనం ఏయించబోయేది ఒక్క గాంధీగారి విగ్రహమేగా? మరి నలుగురు జాతీయ నాయకుల పేర్లు చెబితే ఎలా?'' అన్నాడు, అయోమయంగా.

''బలేవాడివయ్యా పంతులూ! జాతీయ నాయకులే సెప్పింది సేయలేకపోయారు! ఇక మనమెంత, మన బలగమెంత! డబ్బు వసూలయ్యేదాక నాలుగు కేస్టుల నాయకుల పేర్లు సెప్పేది! అంతగా గిట్టనోడు యివరాలడిగితే మన యిస్కూలు నాలుగు దిక్కుల్లో నాలుగు యిగ్రాలు ఏయిత్తుండామనీ, పెస్తుతం గ్యాంధీ యిగ్రం, రిపబ్లిక్‌డేకి ఏయిత్తుండామనీ, ఆంధ్ర రాష్ట్రావతరణంరోజు వొకటీ, ఇండిపెండెన్సు దినాన ఒకటి, పంతుళ్ళ దినాన వొకటి ఏయిత్తామని సెబుదాం!'' అన్నాడు, గారపళ్ళల్లో తాజ్‌మహల్ బీడీ యిరికించుకుంటూ, నవ్వి

భజగోవిందానికి మతిపోయి, వళ్ళు చల్లబడిపోయింది

''మీకు కొత్తకాబట్టి భయపడిపోతుండారు గాని పంతులుగారూ! మీకెందుకు, నేసెప్పినట్టు సేయండి ఏ పేచీ వుండదు. ఈడ గమ్మత్తేద్దంటే, యీ యిగ్రాలకోసం సందా ఏసేవోళ్ళు– పావలా– అర్దాకంటే సందాలియ్యరు! కాబట్టి, తరువాత మనం అసలిగ్రాలు ఏశామా లేదా అనేది యీళ్ళల్లో కెవళ్ళకీ పట్టదు! అయినా వసూలయినదాంట్లో సగం అవతారానికీ, అందులో సగం యెద్దుమేష్టారు కడుపులోకి సర్దుకుంటే, యింకా యిగ్రం లేసేదెక్కడ? పాపిష్టిజన్మ కాకపోతే– నోరాళ్ళది పెద్దపేరు మనదీ!'' అన్నాడు, పానకాలు బాధగా బీడీ పొగ ముక్కుల్లోంచి వదలి

తరువాత జాతీయ నాయకుల పేర్లు చెబుతూ చందాలు వసూలుచేస్తున్నప్పుడు, పానకాలు చెప్పినట్లే ఏ కులంవాళ్ళు ఆ కులం నాయకుడికి మాత్రమే చందాలు వేశారు చదువుకోనివాళ్ళకంటే చదువుకున్నవారిలోనే ఈ కులాభిమానం హెచ్చుగా కనిపించింది పెద్దలకంటే పిన్నల్లోనే యీ జాడ్యం వెర్రితలలు వేసినట్టు కనిపించటం భజగోవిందానికి మరీ ఆశ్చర్యం కలిగించింది.

''జాతీయ నాయకులంతా, తమ తమ కులాల, మతాల విషయాలు మరచి, అవి పోవాలని, భావిభారత పౌరులంతా ఆదర్శప్రాయులైన

# ఆపద్ధర్మం

ప్రపంచ పౌరులు కావాలని కంకణాలు కట్టుకొని పోరాడితే, యిప్పటివాళ్ళంతా, ముఖ్యంగా యువతరం – జాతీయ నాయకుల్ని తమ తమ కులాల, మతాల, ప్రతినిధులుగా గుర్తుపెట్టుకోవటం ఏమిటి?'' – అనే ప్రశ్న భజగోవిందం మెదడుని, యక్షప్రశ్నలా తొలచటం ప్రారంభించింది

తరువాత నానాగడ్డికరచి, నాలుగు విగ్రహాలకి నాలుగువేలు పోగుచేసినప్పుడు తేలిసిన మరో విషయం ఏమిటంటే చందాలు వేసినవాళ్ళు జాతీయ నాయకులమీది భక్తికంటే రౌడీ పానకాలును, వాడి బుర్రమీసాలను, నిప్పుకణికల్లాంటి వాడి వాలకాన్ని చూసి, 'రౌడీ వెధవ! వాడితో మనకు పేచీ ఎందుకు ఏదో ఇచ్చి పంపుదాం'' – అన్న భయమే, ఎక్కువ పని చేసినట్టు కనిపించింది చందాల పని పూర్తయ్యి యిక విగ్రహం ఆర్డరివటమే ఆలస్యం! అనుకుంటుండగా, ఒకరోజు, పానకాలు తప్పతాగి భజగోవిందం యింటికొచ్చి ''ఇదిగో పంతులూ! గ్యాంధీ యిగ్రం సంగతి నేను సూసుకుంటుండా! రేపు, టేజీ, మైకు, షామియానాల పని నువ్వు సూడు!' అన్నాడు

''పోనీ పీడావదిలింది! లేకపోతే ముష్టి మూడొందలకి సిమెంటుతో గాంధీ విగ్రహం బస్ట్‌సైజ్ చేసేదెవరు?'' అనుకున్నాడు భజగోవిందం ఆ కార్యభారం, పానకాలు తీసుకున్నందుకు సంతోషిస్తూ.

*   *   *

అనుకున్నరోజు అనుకున్నట్లుగా, నాలుగడుగుల దిమ్మెమీద దుప్పటి కప్పిన విగ్రహం 'భగత్‌సింగ్' హైస్కూల్ ఆవరణలో వెలిసింది

చివరి నిముషంలో ఇన్‌కంట్యాక్సు ఆఫీసరు అనుకోకుండా హైద్రాబాద్ పోవటంతో కొత్తగా తాసీల్దార్‌గా ప్రమోట్ అయిన డిప్యూటీ తాసీల్దార్, అధ్యక్షత వహించాడు. ఆయన పొట్టి సంతకాలకు అలవాటుపడ్డ పొట్టివాడు కావటాన, ''మహావిద్యార్థులారా – పంతుళ్ళారా! మా దొరగారు – కలెక్టర్‌గారు రావల్సిన ఫంక్షను' అదృష్టంకొద్దీ ఈ కార్యక్రమం దశావతారంగారి మాట తీసేయలేక నేనొప్పుకున్నా! మన జాతిపిత గాంధీగారి విగ్రహం ఇది! అందుకని అంతా ''బోలో స్వతంత్ర భారత్‌కి – జై! మహాత్మా గాంధీకి – జై!'' అని అరవండి'' – అంటూ తాసీల్దారు దుప్పటి తొలగించాడు. పిల్లలు పెద్దలు ''మహాగాంధీకీ జై'' – అంటూ అరుస్తూ ఒక్కసారి ఆగిపోయారు!

అంతే!

ఆశ్చర్యం!!

ఎవరి మొహానా నెత్తురుచుక్కలేదు!

''ఏందిది ఎద్దుమేష్ట్రూ!'' అన్నాడు దశావతారం తన ప్రక్కనేవున్న ఆయన్ని మోచేత్తో డొక్కలో కుమ్మి!

హెడ్‌మేష్టర్ నూకరాజు ఆముదం త్రాగిన ముఖంతో ''ఏమిటో సార్! అంతా మాయగా వుంది?'' అన్నట్లు, ముఖం మాడ్చుకుని, భజగోవిందం వైపు చూశాడు, వురిమినట్టు!

అంతవరకు స్టేజి ప్రక్కన పిల్లల్ని సర్దుతున్న భజగోవిందం, సిమెంటు దిమ్మెమీది విగ్రహం చూసి అదెవరిదో గుర్తురాక, నెత్తిన పిడుగు పడ్డట్టు అదిరిపడ్డాడు!

ఆ విగ్రహం ఎవరిదో గుర్తుపట్టటానికి కళ్ళజోడు సర్దుకుంటున్నాడు తాసిల్దారు!

పుస్తకాల్లో తమకు కనిపించే బట్టతలా, బోసినోరు, కళ్ళజోడు, కనబడక – అవి ఆ విగ్రహంలో ఎక్కడున్నాయో తెలుసుకోవాలని వెతుకుతున్నారు, పిల్లలు

చీమ చిటుక్కుమంటే వినిపించే నిశ్శబ్దం!

ఇక మార్గాంతరంలేక హెడ్మాస్టరు నూకరాజు ''మహాజనులారా! ఈ గాంధీ విగ్రహాన్ని తయారు చేయించింది మన భజగోవిందంగారు! ఆయన ఈ విగ్రహానికి సంబంధించిన వివరణ చెబుతారు!'' అన్నాడు, తన పాపభారమంతా, పాపాలభైరవుడు భజగోవిందం మీదకు నెడుతూ

అప్పటికే చెమటలుపట్టి, నోట మాట రాక, గుండె వేగం హెచ్చి, చెవుల్లోంచి వెచ్చటి ఆవిరి వస్తున్న భజగోవిందం లేని ధైర్యం తెచ్చుకొని, క్షణకాలంలో తన కర్తవ్యం గుర్తొచ్చి, కోటు తొడిగి, మీసకట్టు, పెద్దచెవులు, ప్రక్కపాపటతో వున్న పాతికేళ్ళ యువకుడి విగ్రహాన్ని చూస్తూ – కళ్ళనీళ్ళు క్రుక్కుకుంటూ ''మహాజనులారా! భారతదేశంలో, గాంధీమహాత్ముడి విగ్రహాలు అనేకం వున్నాయి! కాని యిలాటి విగ్రహం గాంధీగారిది, ప్రపంచంలో ఎక్కడా లేదనే చెప్పా

ఇది గాంధీగారు, ఇంగ్లాండుకు చదువుకోడానికి వెళుతున్నప్పుడు తీసిన ఫొటో ఆధారంగ చేసింది. అందుకే మనం ఇది గాంధీగారి విగ్రహం అంటే నమ్మలేకపోతున్నాము అసలు గుర్తేపట్టలేక పోతున్నాము

ఇక్కడ మనం గుర్తుపెట్టుకోవలసింది, ఎంతో అధునాతనమైన ఆంగ్ల నాగరికతను అనుకరించిన గాంధీమహాత్ముడు, తరువాత నిజమైన పేదప్రజల ప్రతినిధిగా కొల్లాయికట్టి జీవించాడో, భావిభారత పౌరులైన మీకందరికీ తెలియాలని, ఈ విగ్రహాన్ని చూసి మీరు ప్రతిక్షణం ఆయన ఆదర్శాలను గుర్తుచేసుకోవాలనే ఈ ఏర్పాటు చేశాము!'' అన్నాడు.

తాసిల్దారుతో సహా అందరూ తమ హర్షాన్ని వెలిబుచ్చుతూ చప్పట్లు చరిచారు బాలభటులు మంగళవాయిద్యాలు మ్రోగిస్తుండగా ''భలే తాత మన బాపూజీ'' అంటూ ఆడపిల్లలు పాటలు పాడారు తరువాత ప్యారీ స్వీట్సు పంచారు

చివరికి తెలిసిన విషయమేమిటంటే – ఎవరో లక్షాధికారి విదేశాల్లో చదువుకోసం వెళ్ళి చనిపోయి తన ఏకైక పుత్రుడి విగ్రహాన్ని చేయిస్తే, తాగిన మైకంలో వున్న పానకాలు, రాత్రికి రాత్రి ఆ విగ్రహం ఎత్తుకొచ్చి స్కూల్లోని దిమ్మె ఎక్కించి దాన్ని జాతిపిత స్థానంలో పెట్టాడు. ఎవరి పబ్బం వాళ్ళు తెలివిగా గడుపుకుంటుంటే ఆ విగ్రహం నిశ్చలంగా వుండిపోయింది